## విలేకరులు కావలెను

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :113 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## కుంభకోణాల చరిత్రలో చంద్రబాబు
# ఓ ఆణిముత్యం

- కొడుకును కాపాడుకునే ఆరాటంలో డీఎస్సీ స్కామ్‌ను నిర్వీర్యం
- తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు.. పై నుంచి కింది స్థాయి వరకు కుమ్మక్కు
- మీడియా సమావేశంలో వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి

**తాడేపల్లి**

చంద్రబాబు కుంభకోణాల చరిత్రలో డీఎస్సీ స్కామ్ అనేది ఓ ఆణిముత్యమని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో డీఎస్సీ అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. డీఎస్సీ స్కామ్‌ను దగ్గరుండి నిర్వీర్యం చేస్తున్నారని, కొడుకును కాపాడుకోవాలనే ఆరాటంలో చంద్రబాబు ఉన్నారని వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతూ వ్యవస్థలపై నమ్మకం లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇలాంటి స్కామ్‌ల వల్లే కాక్రోచ్‌లు (కాక్రోచ్ జనతా పార్టీ.. జెన్ జీ ఉద్యమాన్ని

వివరాలు 2లో..

# ఫలితాలు కన్పించాలి



- నాకు వాస్తవ నివేదికలు కావాలి
- కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి
- కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి**

శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక

వివరాలు 2లో..



## ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు

- సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ
- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

## బంగాళాఖాతంలో
# అల్పపీడనం



- అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన
- మత్స్యకారులకు హెచ్చరిక
- ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం
- దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడి

**అమరావతి**

ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ

వివరాలు 2లో..

## అంతరిక్షం అందరిదీ,.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి



- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- అంతర్జాతీయ చట్టాల ఆధారంగా సురక్షిత, శాంతియుత, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు
- 'శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది
- ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది



## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం

- కార్గో నౌకలో 20 మంది మృతి
- చైనాలోని కింగ్‌డావో షిప్‌యార్డ్‌లో కార్గో నౌకలో భారీ అగ్నిప్రమాదం
- ఈ దుర్ఘటనలో 20 మంది సిబ్బంది మృతి, ఐదుగురు గల్లంతు
- మరమ్మతుల కోసం ఆగిన 'ఓషన్ మెలోడీ' నౌకలో ఘటన
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం

## ఏపీ రైల్వే కనెక్టివిటీకి కేంద్రం
# గ్రీన్ సిగ్నల్

- అశ్వినీ వైష్ణవ్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు
- దక్షిణాదిలో భారీ మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా ఊపింది
- ఈ ప్రాజెక్టు ద్వారా ఏపీ , తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకలకు మేలు కలుగజేస్తుంది
- రూ.10 వేల 21 కోట్ల అంచనా వ్యయంతో పట్టాలెక్కనుంది



**అమరావతి**

రైళ్ల రద్దీకి ఇక చెక్. సరుకు రవాణాలో సరికొత్త వేగం. 2030 నాటికి దక్షిణాది రైల్వే నెట్‌వర్క్ సరికొత్త హంగులతో దర్శనమివ్వబోతోంది. దక్షిణ భారతదేశ రవాణా రంగానికి సరికొత్త జవసత్వాలు అందిస్తూ, దశాబ్దాల రైళ్ల రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం మెగా ప్లాన్ సిద్ధం చేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో రూ.10,021 కోట్ల భారీ అంచనా వ్యయంతో 5 మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా నాలుగు దక్షిణాది రాష్ట్రాల మీదుగా 540 కిలోమీటర్ల మేర సాగే ఈ రైల్వే విస్తరణ, అటు ప్రయాణికులకు ఇటు సరకు రవాణాకు పెను మార్పులు తీసుకురాబోతోంది. తిరుమల శ్రీవారి భక్తులకు కనెక్టివిటీ కష్టాలు తీరనున్నాయి. రేణిగుంట-అరక్కోణం

వివరాలు 2లో..



## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
- పిల్లల ఆన్‌లైన్ భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మైనర్లు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించడంపై రక్షణ చర్యలు కోరుతూ పిటిషన్
- దీనిపై కేంద్రానికి నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం

## 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్
# భూములకు రిజిస్ట్రేషన్

- 28 లక్షల ఎకరాలు 22--ఏ జాబితా నుండి తొలగింపు
- దీర్ఘకాలిక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం
- కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి**

రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం

వివరాలు 2లో..

## రిజిస్టర్డ్ పార్టీగా టీవీకే ఈసీ అధికారిక గుర్తింపు

- ప్రజలకు విజయ్ కృతజ్ఞతలు
- తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గుర్తింపు
- తమిళనాడు, పుదుచ్చేరిలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా గుర్తింపు



# బంగాళాఖాతంలో అల్పపీడనం



-మొదటిపేజీ తరువాయి

అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తీర ప్రాంత ప్రజలను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు.

### ఉత్తరాంధ్రకు వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. దీని ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని జిల్లాల్లో రానున్న కొద్ది రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### గంటకు 60 కి.మీ వేగంతో గాలులు

తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన గాలుల కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్ర తీరానికి వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### మత్స్యకారులకు 48 గంటల హైఅలర్ట్

సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మత్స్యకారులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 48 గంటల పాటు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని ఆదేశాలు ఇచ్చింది. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉన్నందున చిన్న పడవలు, మరబోట్లు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సమాచార వ్యవస్థల ద్వారా సందేశాలు పంపుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను పర్యవేక్షిస్తోంది.

### అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన

అల్పపీడన ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో వరుణుడు ప్రతాపం చూపాడు. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వేసవి తాపంతో, ఉక్కపోతతో అల్లాడిపోతున్న స్థానిక ప్రజలను ఈ వర్షం పలకరించింది. వాన కారణంగా పలుచోట్ల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

# 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్



-మొదటిపేజీ తరువాయి

ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22--ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22--ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జీవో నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇకపై ఏదైనా ప్రైవేట్ భూమిని 22--ఏ జాబితాలో చేర్చాలంటే సంబంధిత అధికారే ఆ భూమి స్వభావాన్ని నిరూపించాల్సి ఉంటుందని, అందుకు స్పష్టమైన విధివిధానాలతో జీవో నెం.445 తెచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో పెడితే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వట్టిచెరుకూరు, శెట్టిపల్లి, పుల్లడిగుంట, కంగుంది, అవులపల్లి, గూటుపల్లి సహా కోనసీమ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో వేలాది మందికి ఆస్తులపై హక్కులు పునరుద్ధరించామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే చొరవతో నాలుగు గ్రామాల్లోని రెండు వేల ఎకరాలకు పైగా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికై 'మీ భూమి -- బ్లాక్‌చైన్ టెక్నాలజీ' ప్రాజెక్ట్ ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నిరంతరం ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. గత ప్రభుత్వంలో మాదరి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వే 2.0ను సమర్థవంతంగా చేస్తున్నామని, సర్వే శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగడం సంతోషకరమని, అయితే వందశాతం తప్పుల్లేకుండా రీ సర్వే చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

# కుంభకోణాల చరిత్రలో చంద్రబాబు ఓ ఆణిముత్యం

-మొదటిపేజీ తరువాయి

ఉద్దేశించి) పుట్టుకొస్తున్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ కుంభకోణంలో పై నుంచి కింది స్థాయి వరకు కుమ్మక్కయ్యారని, తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చేశారని వైయస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఖమ్మం (తెలంగాణ)లో జరగని ఈవెంట్ల పేరుతో ఉద్యోగాలు ఇచ్చిన కేసును ఆధారాలతో సహా చూపించారని పేర్కొన్నారు. ఆ జూడో అసోషియేషన్ అధ్యక్షుడు చంద్రబాబు దగ్గరి బంధువు, టీడీపీ ఎంపీ భరత్ అని తెలిపారు. సాఫ్ట్‌బాల్ విషయంలోనూ ఇదే జరిగిందని, దాని అధ్యక్షుడు ఎమ్మెల్యే కూన రవి అని గుర్తు చేశారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన ఆధారాల ఆధారంగా దొంగ సర్టిఫికెట్లను గుర్తించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంటూ.. కుంభకోణం జరిగిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏంటని వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. డీఎస్సీ స్కామ్‌లో వాస్తవాలు బయటపడుతున్నా.. దాన్ని కప్పిపుచ్చేందుకు కూటమి ప్రభుత్వం పడరాని పాట్లు పడుతోందని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పోర్ట్స్ కోటాలో అర్హతలు లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని, ఏడుసార్లు




వెరిఫికేషన్ చేసిన తర్వాతే నియామకాలు చేపట్టామని అధికారుల ద్వారా చెప్పిస్తూ ఇప్పుడు కవర్‌అప్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఏ పరీక్ష రాయకుండానే విశాఖపట్నంకు చెందిన యోగేశ్వరరావుకు స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ ఉద్యోగం ఇచ్చారని ఆరోపించారు. ఆయనతో పాటు ఆయన సోదరికి కూడా ఉద్యోగం ఇచ్చారని, కుటుంబం మొత్తానికీ 'ఫ్యామిలీ ప్యాకేజీ'లా పోస్టులు కట్టబెట్టారని విమర్శించారు. ఈ వ్యవహారంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కీలకంగా వ్యవహరించిందన్నారు. యోగేశ్వరరావు, మోహినీదేవి పేర్లు తాము నిర్వహించిన ఈవెంట్‌లో లేవని తెలంగాణ ఖోఖో అసోసియేషన్ స్పష్టం చేసిందని వైయస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. అయినప్పటికీ వారు పోటీల్లో పాల్గొన్నట్లు చూపించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ప్రగడ కల్యాణి విషయంలోనూ ఇదే తరహా వ్యవహారం జరిగిందన్నారు. ఆమె కబడ్డీ పోటీలో పాల్గొన్నట్లు పేర్కొన్నప్పటికీ.. 2003లో నాగార్జున యూనివర్సిటీలో సౌత్ జోన్ కబడ్డీ పోటీలు జరిగాయని, కాబట్టి ఆమె సమర్పించింది నకిలీ సర్టిఫికెట్‌గా తేలిందని ఆయన చెప్పారు. ఈడిగ ప్రభాకర్ వ్యవహారాన్ని కూడా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తావించారు. ఆయన టెట్‌కు క్వాలిఫై కాలేదని, కనీస విద్యార్హత కూడా లేదని డీఈవో స్వయంగా వెల్లడించారని తెలిపారు. అయినా ఉద్యోగం ఎలా వచ్చిందని ప్రశ్నించారు.

# రెబల్స్ డేంజర్ బెల్స్

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం.పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కడా పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది.మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది.అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## ఫలితాలు కన్పించాలి





-మొదటిపేజీ తరువాయి

నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెరీ ?స నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెరీ ?సకు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెరీ ?స మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్ గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్--వన్ విజన్--వన్ టీమ్--వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.

"మనకు ఉన్న అవకాశాలను అరీ లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10--15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సృష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ ఆదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తరలించగలిగాం. ప్రకాశం బ్యారేజీని 200 సార్లు ఇప్పటి వరకూ నింపగలిగాం. డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సష్టించిన నిశ్శబ్ద నీటి ప్రయాణాన్ని రాష్ట్ర ప్రజలు, దేశం కూడా గుర్తించింది. రైతుల గురించి సీఎం పడుతున్న నిరంతర తపనను ఎకనమిక్ టైమ్స్ పత్రిక వాటర్ మాన్ గా ఆయన్ను కీర్తిస్తూ కథనం రాసింది. ఇది సీఎం సాధించిన విజయం.. ముఖ్యమంత్రి విజయంలో ఏపీ అభివద్ధి ఉంది." అని మంత్రి అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీ రైల్వే కనెక్టివిటీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్



-మొదటిపేజీ తరువాయి

మార్గంలో రైళ్లు ఇకపై జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టనున్నాయి. కేంద్ర కేబినెట్ ఆమోదించిన మెగా రైల్వే ప్రాజెక్టులలో భాగంగా రూ.1,157 కోట్లతో ఏపీ పరిధిలో చేపట్టబోయే 3, 4వ లైన్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

### తెలుగు రాష్ట్రాల రవాణా రంగానికి జీవనాడి

దక్షిణ భారతదేశంలో దశాబ్దాలుగా ప్రయాణికులను వేధిస్తున్న రైళ్ల రద్దీ సమస్యకు చెక్ పెట్టేందుకు, సరుకు రవాణాను పరుగులు పెట్టించేందుకు కేంద్ర కేబినెట్ భారీ మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకలను కలుపుతూ 10,021 కోట్ల అంచనా వ్యయంతో 5 నూతన ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద చేపడుతున్న ఈ భారీ కసరత్తు ద్వారా మొత్తం 17 జిల్లాల్లో 540 కిలోమీటర్ల మేర నూతన రైల్వే లైన్ల విస్తరణ జరగనుంది.

అరక్కోణం - రేణిగుంట మధ్య 77 కిలోమీటర్ల మూడు, నాలుగు లైన్ల నిర్మాణం ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇవి పూర్తైతే ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీకి పూర్తిగా తెరపడనుంది. తిరుమల వేంకటేశ్వర స్వామి , తిరుచానూరు పద్మావతి అమ్మవారు, అలాగే తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయానికి వెళ్లే లక్షలాది మంది భక్తులకు ఈ అదనపు లైన్లు వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయి. 2029 -30 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టులు తెలుగు రాష్ట్రాల రవాణా రంగానికి జీవనాడిలా మారబోతున్నాయని రైల్వే వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### వైష్ణవ్‌కు కృతజ్ఞతలు చెప్పిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అనుసంధానాన్ని బలోపేతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం కీలక సహకారం అందించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో, రేణిగుంట-అరక్కోణం మార్గంలో 46 కిలోమీటర్ల మేర మూడో-నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆయన ప్రకటించారు. సుమారు రూ.1,157 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు వల్ల ఆ మార్గంలో రద్దీ గణనీయంగా తగ్గడమే కాకుండా, రైళ్ల రాకపోకలలో సమయపాలన మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. తిరుపతికి రైలు అనుసంధానం మెరుగుపడటం వల్ల శ్రీవారి ఆలయాన్ని సందర్శించే భక్తులకు, ఇతర ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. అలాగే ఈ ప్రాజెక్టు సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి ఈ కీలక నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# 80 వ వార్డులో కార్పొరేటర్ గా పోటీకి మళ్ల శ్రీను సిద్ధం.

**జనసేన అవకాశం ఇస్తే బరిలోకి దిగుతా శ్రీను.**



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 10:**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనకాపల్లి పట్టణం లోని 80 వ వార్డు నుంచి కార్పొరేటర్గా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు జనసేన నాయకుడు మళ్ల శ్రీను తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి అనకాపల్లి నూకాంబిక దేవస్థానం ఆవరణలో కూటమి నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి స్థానిక ఎన్నికల పై చర్చించారు. ఈ సందర్భంగా మళ్ల శ్రీను మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించిన నాటి నుంచి అనకాపల్లిలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజా సమస్యల పై పోరాటం చేస్తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విజయం కోసం పార్టీ శ్రేణులతో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని, 2017లో జనసేన సేవాదళ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు తెలిపారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందనే నమ్మకంతో పనిచేస్తున్నానన్నారు.

ప్రస్తుతం 80 వ వార్డు బాధ్యతలు నిర్వహిస్తున్న తనకు జనసేన పార్టీ, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భీమరశెట్టి రామ్కి అవకాశం కల్పిస్తే 80వ వార్డు నుంచి కార్పొరేటర్గా పోటీ చేసి ప్రజలకు మరింత సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మళ్ల శ్రీను స్పష్టం చేశారు. కార్యకర్తల కృషిని పార్టీ గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. మళ్లరామ్ (బుజ్జి) అధ్యక్షుల జరిగిన ఈసమావేశంలో జనసేన పార్టీ నాయకులు శ్రీరామదాసు, గోవిందరావు, గల్లా కొండలరావు, కోట్నిగణేష్, కొమ్మోజి రాజు, కర్రీ చిన్న అప్పలనాయుడు, కొణతాల శ్రీనివాసరావు, కూటమి నాయకులు, మెగా అభిమానులు, 80వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తీర ప్రాంత రక్షణకు తాటి పళ్ళు నాటిన హరితసేన



**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 10:**తీర ప్రాంత రక్షణ కవచం కోసం తాటి పళ్ళు నాటాలన్న అటవీ శాఖ పిలుపునకు కేథరిన్ విద్యార్థులు స్పందించారు. భీమిలి గిల్మన్ ఫీల్డ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం నేతృత్వంలో సుమారు 100 మంది విద్యార్థులు ఆకుపచ్చ టీషర్టులతో హరితసేనగా పాల్గొని తాటి పళ్ళు నాటారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. మల్లికార్జున రావు తాటి పళ్ళు నాటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తుఫాను గాలుల ఉధృతిని తగ్గించేందుకు తీర ప్రాంత రక్షణ వనాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కె.వి.ఎస్. రాజు, డీఎఫ్ఓ రవీంద్ర ధామ్, ఏక్షన్ ఎయిడ్ ప్రతినిధి ఐ. కృష్ణకుమారి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి



**తగరపువలస, పెన్ సత్తా, సెప్టెంబర్ 10:**తగరపువలస, భోగాపురం (కౌవులవాడ) అవంతి పాలిటెక్నిక్ కళాశాలల్లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అవంతి కళాశాలల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు.దవిద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచి విలువలు, క్రమశిక్షణతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అతిథులు సూచించారు. చదువుతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. ఏ. చంద్రశేఖర్, ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ప్రిన్సిపాళ్లు బి. జగదీశ్వరరావు, జి. శ్రీధర్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం





**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 10:** భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం పాలవలస గ్రామానికి చెందిన చిప్పాడ రాజేశ్వరికి రూ.31,796, విశాఖ తూర్పు నియోజకవర్గం 21వ వార్డుకు చెందిన దమ్ము కాంతకు రూ.70,604 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ అందజేశారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన సాయాన్ని ఎంపీ అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎంపీ శ్రీభరత్‌కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.

- **కోర్టుల చుట్టూ తిరగకుండా, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక.**
- **జీవీఎంసీకి సంబంధించిన వివిధ అంశాలపై నోటీసులు అందుకున్నవారు, కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నవారు పరిష్కారానికి ముందుకు రావాలి.**
- **ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ఇడూ ట్రేడ్ లైసెన్స్, నీటి చార్జీలు తదితర అంశాలపై పరస్పర అంగీకారంతో పరిష్కారానికి అవకాశం.**
- **లోక్ అదాలత్‌లో పాల్గొనేందుకు ఎలాంటి లీగల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.**
- **నాలుగు న్యాయస్థానాల పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు -- ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.**
- **జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 10::** కోర్టుల చుట్టూ తిరగకుండా తమ సమస్యలను సులభంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జీవీఎంసీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న ఉదయం 9.00 గంటల నుంచి లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, జీవీఎంసీకి సంబంధించిన వివిధ అంశాలపై నోటీసులు అందుకున్న వ్యక్తులు, సంస్థలు, కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పరస్పర అంగీకారంతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.జీవీఎంసీ పరిధిలోని భీమిలి, మధురవాడ, ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, గాజువాక, పెందుర్తి, అగనంపూడి, అనకాపల్లి జోన్లకు సంబంధించి రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం తదితర విభాగాల పరిధిలో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ఇడూ ట్రేడ్ లైసెన్స్, నీటి చార్జీలు, అడ్వర్టైజ్‌మెంట్ చార్జీలు తదితర అంశాలకు సంబంధించి జీవీఎంసీ నుంచి నోటీసులు అందుకున్నవారు, కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్న వ్యక్తులు, సంస్థలు జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై పరస్పర అంగీకారంతో పరిష్కారం పొందవచ్చని కమిషనర్ తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

**" జోన్ల వారీగా న్యాయస్థానాలు"**

అనకాపల్లి జోన్ల పరిధిలోని కేసులకు సంబంధించిన వారు అనకాపల్లి జిల్లా న్యాయస్థానాల సముదాయానికి, అగనంపూడి ,గాజువాక జోన్ పరిధిలోని వారు గాజువాక న్యాయస్థానాల సముదాయానికి, భీమిలి జోన్ పరిధిలోని వారు భీమునిపట్నం న్యాయస్థానాల సముదాయానికి హాజరై తమ కేసులను పరిష్కరించుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

అదేవిధంగా మధురవాడ, ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, పెందుర్తి జోన్ల పరిధిలోని కేసులకు సంబంధించిన వారు విశాఖపట్నం జిల్లా న్యాయస్థానాల సముదాయానికి హాజరై జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లోక్ అదాలత్‌లో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు ఎలాంటి లీగల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని కమిషనర్ ప్రత్యేకంగా తెలిపారు. జీవీఎంసీకి సంబంధించిన కేసుల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున, సంబంధిత న్యాయస్థానాల వద్ద ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను జీవీఎంసీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఇప్పటికే జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో సంబంధిత కేసులు, నోటీసులకు సంబంధించిన వ్యక్తులు, సంస్థలకు సమాచారం చేరవేస్తూ విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. సంబంధిత అధికారులు కూడా ప్రజలకు అవసరమైన సమాచారం, సహకారం అందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం వెచ్చించకుండా, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరస్పర అంగీకారంతో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఒక మంచి అవకాశమని, జీవీఎంసీకి సంబంధించిన నోటీసులు అందుకున్నవారు, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న వ్యక్తులు, సంస్థలు సెప్టెంబర్ 12వ తేదీ శనివారం ఉదయం 9.00 గంటల నుంచి తమకు సంబంధించిన న్యాయస్థానాలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.



# దివిస్ సీఎస్ఆర్ నిధులతో ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి పనులు





**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 10:**భీమిలిలోని ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివిస్ సీఎస్ఆర్ నిధులతో రూ.31.92 లక్షల వ్యయంతో నిర్మించిన పాత్‌వేలు, రిటైనింగ్ వాల్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపడుతోందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగాలని సూచించారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు సంప్రదాయాలు, విలువలను గౌరవించాలని కోరారు.

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేఖ కళాశాలలో అందుబాటులో ఉన్న వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. దివిస్ సంస్థ గతంలో ఆర్వో ప్లాంట్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, రన్నింగ్ ట్రాక్‌తో పాటు తాజాగా సీసీ రోడ్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సహకరించినందుకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో దివిస్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పి. జగదీష్, కళాశాల పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు గాడు వెంకటప్పడు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, దివిస్ సీఎస్ఆర్ హెచ్ఆర్ సురేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మారికవలస గురుకుల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గంటా సానుకూల స్పందన



**భీమిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 10:**మారికవలస గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని టీడీపీ నాయకుడు చెట్టి అశోక్ చక్రవర్తి తెలిపారు.

భీమిలి ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన గంటా శ్రీనివాసరావును కార్యక్రమం అనంతరం అశోక్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. మారికవలస గురుకుల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆయన తీసుకుంటున్న చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యంలో సుమారు 15 గిరిజన సంఘాలతో ఏర్పడిన రాష్ట్రస్థాయి కమిటీలో తనకు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్గా బాధ్యతలు అప్పగించిన విషయాన్ని గంటా శ్రీనివాసరావుకు అశోక్ చక్రవర్తి వివరించారు. మారికవలస గురుకుల విద్యార్థుల సమస్యలపై త్వరలో గిరిజన సంఘాల నాయకులతో కలిసి ఎమ్మెల్యేను కలసి పూర్తి స్థాయిలో పరిష్కారం కోసం వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. దీనిపై గంటా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించినట్లు అశోక్ చక్రవర్తి వెల్లడించారు.

## బస్సులో వృద్ధురాలి బంగారు ఆభరణాలు, నగదు చోరీ

**ఆనందపురం,పెన్ సత్తా, సెప్టెంబర్ 10:** కొరుకొండ సైనిక్ స్కూల్ బస్‌స్టాప్ నుంచి అనంతవరం జంక్షన్ వరకు బస్సులో ప్రయాణిస్తున్న 66 ఏళ్ల వృద్ధురాలి వద్ద నుంచి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.7,500 నగదును చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబర్ 3న బస్సులో ప్రయాణించిన వృద్ధురాలు అనంతవరం జంక్షన్‌లో దిగిన అనంతరం తన చీర, సిక్కానికి రంధ్రం ఏర్పడినట్లు గుర్తించారు. సిక్కంలో భద్రపరిచిన రెండు బంగారు గొలుసులు, నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. అనారోగ్యం కారణంగా ఆలస్యంగా సెప్టెంబర్ 10న పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు ఆనందపురం క్రైమ్ పోలీసులు గుర్తుతెలియని నిందితులపై కేసు నమోదు చేశారు. క్రైమ్ ఎస్ఐ షరీఫ్ దర్యాప్తు చేపట్టి నిందితుల కోసం గాలిస్తున్నారు.

# రీయాక్టివ్ కాదు.. ప్రోయాక్టివ్ పాలన కావాలంటున్న చంద్రబాబు!



**విజయవాడ, సెప్టెంబర్ 10, :** ఏపీ సీఎం చంద్రబాబు అన్ని జిల్లాల కలెక్టర్లకు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా రియాక్టివ్ గవర్నెన్స్ కాదు.. ప్రోయాక్టివ్ గవర్నెన్స్(పాలన) కావాలని తేల్చి చెప్పారు. అయితే.. అసలు ఇది ఏంటి? అనేది ఆసక్తిగా మారింది. సహజంగా ప్రతి జిల్లాలోనూ కలెక్టరే పాలన పరంగా చీఫ్. ఆయన లేదా ఆమె కనుసన్నల్లోనే అన్నీ జరుగుతాయి. అయితే.. ఇది కాదు.. ఇంతకు మించి అనేది చంద్రబాబు ఉద్దేశం.

**రియాక్టివ్ గవర్నెన్స్ అంటే..**

ఏదైనా విషయం జరిగిన తర్వాత స్పందించడాన్ని రియాక్టివ్ గవర్నెన్స్ అంటారు. ఉదాహరణకు.. సమ స్యలు, సంక్షోభాలు లేదా సవాళ్లు తలెత్తిన తర్వాత చర్యలు తీసుకోవడం వంటివి ఈ విధానంలోకి వస్తాయి. ఈ విధానం యొక్క ప్రధాన లక్షణం.. దీర్ఘకాలిక ప్రణాళిక కొరతగా ఉంటుంది. ముందుగా ఊహించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం కంటే, అప్పటికప్పుడు తక్షణ పరిష్కారాల మీద ఆధారపడతారు. దీనివల్ల ప్రతికూలతను ఎదుర్కొనే సామర్థ్యం పెద్దగా ఉండదు. దీనిని పరిహరించాలన్నది చంద్రబాబు ఉద్దేశం.


**ఇక, ప్రోయాక్టివ్ గవర్నెన్స్ ఇదీ..**

ఇక, ప్రోయాక్టివ్ గవర్నెన్స్ విషయానికి వస్తే.. వనరుల వృథాను అరికట్టడంతోపాటు.. అధిక వత్తిడిని అధిగమిస్తూ.. జరగబోయే విషయాలను సాంకేతిక పరంగా ముందుగానే గుర్తించడం. తద్వారా.. వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగా ఏర్పాటు చేసుకుని చర్యలు తీసుకోవడం. దీంతో సమస్య తీవ్రత తగ్గి.. ప్రజలకు మేలు జరగడంతోపాటు.. ప్రభుత్వానికి మంచి పేరు కూడా వస్తుంది. సమస్యలు రాకముందే ఊహించి పనిచేసే విధానాన్ని ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అంటారు.

**సాధ్యమేనా?**

దేశంలో ప్రోయాక్టివ్ గవర్నెన్స్ విషయంలో గోవా రాష్ట్రం ముందుంది. ఇక్కడ సముద్రతీరం ఎక్కువగా ఉండడంతో ముందుగానే విపత్తులను ఘటనలను అంచనా వేసి.. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు .. ప్రభుత్వం కూడా.. పారదర్శకంగా వ్యవహరిస్తుంది. దీంతో గోవాలో అన్ని విధాలా అభివృద్ధి కనిపిస్తుంది. దీనినే ఏపీలోనూ అన్వయించాలని చంద్రబాబు చెబుతున్నారు.

# ఫ్యాన్ రెక్కలు విలవిల



**విజయనగరం, సెప్టెంబర్ 10, :**
ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు. ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది. పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

**ఆయువు పై పట్టు...**

ఉత్తరాంధ్రలో వైసీపీకి ఊహించని దెబ్బ తగిలింది. వైసీపీకి బొత్స సత్య నారా యణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. చిన్న శ్రీను రాజీనామా ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయాలను కుదిపేసింది. తన రాజీనామా లేఖను చిన్న శ్రీను జగన్ కు పంపారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చిన్న శ్రీను ఆ లేఖలో పేర్కొన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయంటున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి, జిల్లా అధ్యక్ష పదవికి మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేస్తున్నట్లు లేఖలో ప్రకటించారు. భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పదవికి కూడా చిన్న శ్రీను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీకి ఉత్తరాంధ్రలో చిన్న శ్రీను బలమైన నేతగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా బొత్స సత్యనారాయణ, ఆయన మేనల్లుడు చిన్న శ్రీనుకు మధ్య అంతర్గత యుద్ధం నడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామాచేయడం వెనక అనేక కారణాలున్నాయి. గత కొన్ని రోజుల నుంచి బొత్స సత్యనారాయణ పార్టీకి రాజీనామా చేస్తారని ప్రచారం జరిగింది. అయితే బొత్స సత్యనారాయణ కాదని, ఆయన మేనల్లుడు రాజీనామా చేస్తారని నిన్న వెల్లడయింది. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీని వీడుతున్నట్లు చిన్న శ్రీను తన రాజీనామా లేఖలో అధికారికంగా పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపించారు. చిన్న శ్రీను తన పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పదవులకు కూడా రాజీనామా చేశారు. చిన్నశ్రీను రాజీనామాకు దారితీసిన అసలు కారణాలు అనేకం ఉన్నాయంటున్నారు.. రాజీనామా లేఖలో ఆయన కేవలం వ్యక్తిగత కారణాల వల్లే పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న అసలు కారణాలు మాత్రం వేరేలా ఉన్నాయి. అధికారికంగా వ్యక్తిగత కారణాలని చెప్పినప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మరియు అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం ఈ నిర్ణయం వెనుక కొన్ని కీలక వ్యూహాలు ఉన్నట్లు తెలుస్తోంది. బొత్స సత్యనారాయణ కుమార్తె పొలిటికల్ ఎంట్రీయే చిన్న శ్రీను రాజీనామాకు కారణమని తెలుస్తోంది. తన కుమార్తెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని బొత్స భావిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను విజయనగరం మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని, ఈ మేరకు బొత్స మేయర్ అభ్యర్థి తన కుమార్తె అని ప్రకటించిన తర్వాతనే చిన్న శ్రీను రాజీనామా చేశారని అంటున్నారు.

# విజయసాయిరెడ్డి వెనుక ఉంది ఎవరు

**నెల్లూరు, సెప్టెంబర్ 10, :**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీకి మొదటి నుంచి ఆయువుపట్టులా వ్యవహరించిన సీనియర్ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సొంతంగా నూతన రాజకీయ పార్టీని స్థాపించబోతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లోపార్టీ నడపడం అంటే వందల కోట్ల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. సాధారణంగా ఏ నాయకుడైనా వందల కోట్ల రూపాయల ఆర్థిక వనరులను వెచ్చించి పార్టీ పెడుతున్నారంటే.. తాము ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకుంటారు. కానీ, విజయసాయిరెడ్డి మాత్రం కోట్లాది రూపాయల నిధులను, డిజిటల్ మీడియా సామ్రాజ్యాన్ని సిద్ధం చేసుకుంటూనే.. నేను సీఎం కాను, వేరొకరిని సీఎం చేయడానికి మాత్రమే ఈ పార్టీ అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ విచిత్రమైన వైఖరి వెనుక పెద్ద ఎత్తున తెరవెనుక సమీకరణాలు, దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే చర్చ నడుస్తోందివిజయసాయిరెడ్డి ప్రతిపాదిత వ్యూహాన్ని నిశితంగా పరిశీలిస్తే.. ఇది కేవలం ఒక పార్టీ స్థాపన మాత్రమే కాకుండా, వోట్ స్ప్లిటర్, ఒక పొలిటికల్ ప్రాక్సీ వ్యూహంలా కనిపిస్తోంది. సొంతంగా మాస్ ఫాలోయింగ్ లేదా నేరుగా సీఎం అయ్యేంత ప్రజాదరణ లేదనే స్పృహ ఆయనకు పక్కాగా ఉంది. అందుకే, ప్రత్యక్షంగా సీఎం పీఠం రేసులో లేనని ప్రకటిస్తూనే, వచ్చే ఎన్నికల్లో నిర్ణయాత్మక ఓటు బ్యాంకును చీల్చడం లేదా కింగ్ మేకర్ పాత్రను పోషించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా రాయలసీమ, కోస్తా జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ అసంతృప్త నేతలను, సామాజిక వర్గ సమీకరణాలను తనవైపు తిప్పుకోవడం ద్వారా ఒక 'మూడో శక్తి'గా రూపాంతరం చెంది, గెలుపోటములను ప్రభావితం చేయవచ్చునేది ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ కోట్లాది రూపాయల ప్రయోగానికి అసలు వనరులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఆయనకు ఉన్న ఆర్థిక అవసరం ఏంటి? అనే అంశంపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒక వర్గం కథనం ప్రకారం.. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్‌సీపీకి పడే రెడ్డి, ఇతర సంప్రదాయ ఓట్లను చీల్చి, ప్రధాన విపక్షానికి దెబ్బకొట్టేలా తెరవెనుక కొన్ని అధికార శక్తులు ఈ ప్రయోగానికి ఆజ్యం పోస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా వందల కోట్లు ఖర్చు పెడుతున్నారా లేక గేమ్ ఛేంజర్ గా నిలిపేందుకు అదృశ్య శక్తులు వెనకుండి ఫండింగ్ ఇస్తున్నాయా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఇది వైఎస్ జగన్‌తో మళ్లీ బార్గేనింగ్ చేయడానికి విజయసాయిరెడ్డి ఆడుతున్న మైండ్ గేమ్ అనే వాదన కూడా బలంగా ఉంది. నేరుగా వైఎస్ఆర్‌సీపీలోకి వెళ్లే ద్వారాలు మూసుకుపోవడంతో, బయట ఒక రాజకీయ వేదికను, స్వంత డిజిటల్ మీడియా సామ్రాజ్యాన్ని సృష్టించుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను మళ్లీ గుర్తించేలా ఒత్తిడి తేచ్చే యత్నం చేస్తున్నారని భావిస్తున్నారు. తన పార్టీ ద్వారా కొంత ప్రభావం చూపించగలనని నిరూపిస్తే, జగన్ మళ్లీ తగిన స్థానం ఆఫర్ చేస్తారనే దూరదృష్టితోనే "వేరొకరిని సీఎం చేస్తా" అనే పదాన్ని వాడుతున్నారని విశ్లేషిస్తున్నారు. రాజకీయంలో కేవలం డబ్బులు చల్లి, డిజిటల్ మీడియా సంస్థలను నడిపినంత మాత్రాన ఓటర్లు జై కొడతారనుకోవడం అజ్ఞానమే అవుతుంది. గతంలో కూడా కేవలం ఫండింగ్‌ను నమ్ముకుని, వేరే వ్యూహకర్తల డైరెక్షన్‌లో వచ్చిన మూడో ప్రత్యామ్నాయాలు దారుణంగా విఫలమైన చరిత్ర ఏపీకి ఉంది. విజయసాయిరెడ్డి వద్ద ఉన్న వనరుల కోసమో, డిజిటల్ మీడియా నిధుల కోసమో ఆయన చుట్టూ చేరే తాత్కాలిక నేతలు, అవకాశవాదుల వల్ల పార్టీకి కేడర్ నిర్మాణం సాధ్యం కాదు. వేరొకరిని సీఎం పీఠంపై కూర్చోబెట్టడానికి సొంత జేబుల నుంచి వందల కోట్లు తగలేసేంత అమాయకత్వం రాజకీయాల్లో ఏ నాయకుడికీ ఉండదు. విజయసాయిరెడ్డి ఆడుతున్న ఈ విచిత్రమైన కింగ్ మేకర్ డ్రామా వెనుక ఏ అదృశ్య రాజకీయ శక్తి ఉందో, ఆయన అసలు టార్గెట్ జగనా లేక కూటమి ప్రభుత్వమా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవ్వాల్సి ఉంది.

## 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్

**విజయవాడ, సెప్టెంబర్ 10, :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టాలని భావిస్తున్న ప్రతిష్టాత్మక 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. ఏపీ జలాలపై ఈ విమానాలను నడిపేందుకు ఆసక్తి చూపిస్తూ 'మే హెయిర్', 'స్కైహోప్' వంటి ప్రముఖ దేశీయ విమానయాన సంస్థలు సమర్పించిన నివేదికలకు కేంద్ర పౌరవిమానయాన శాఖ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. పర్యాటక ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, టూరిస్టులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. ఈ ప్రాజెక్టు సజావుగా సాగడానికి కీలకమైన 'వాటర్ డ్రోమ్' అంటే నీటిపై రన్‌వేలు, మౌలిక వసతుల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటి నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ పనుల కోసం త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది కీలక పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాలను గుర్తిస్తూ, సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో ఈ వాటర్ డ్రోమ్ నెట్‌వర్క్‌ను డెవలప్ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ 'ఉడాన్' ఉద్దీపన పథకం మద్దతు కూడా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ చాలా త్వరగా కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా.. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ (పున్నమి ఘాట్), విశాఖ సాగరం, మరియు శ్రీశైలం కృష్ణా నది పరివాహక ప్రాంతాల మధ్య ఈ సీ ప్లేన్లు రాకపోకలు సాగించనున్నాయి. వీటితో పాటు కాకినాడ, సూర్యలంక బీచ్, గండికోట గిరి లోయలు, తిరుపతి రాయలచెరువు, అరకు సమీపంలోని జోలాపుట్ మరియు లంబసింగి తాజంగి జలాశయాలను కూడా ఈ రూట్ మ్యాప్‌లో చేర్చారు. ఈ వినూత్న సేవలు అందుబాటులోకి వస్తే.. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, విహారయాత్ర స్థలాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గడమే కాకుండా, ఏపీ టూరిజం గ్లోబల్ మ్యాప్‌లో మరింత ప్రత్యేకంగా నిలవనుంది

## స్లమ్స్ వారి కోసం భవనాలు

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 10, :** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, మురికివాడల పునర్నిర్మాణ చరిత్రలో కూటమి ప్రభుత్వం మరో కీలక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టిన మురికివాడల పునర్నిర్మాణం ప్రోగ్రామ్‌కు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ విశాఖపట్నం వేలంపేటలో శంకుస్థాపన చేశారు. గత 50 ఏళ్లుగా సరైన నివాస వసతి లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్న 177 కుటుంబాల కలలను సాకారం చేస్తూ, వారి కోసం ఆధునిక అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులకు ఆయన అధికారికంగా భూమిపూజ నిర్వహించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 177 పేద కుటుంబాలకు ఉచితంగా అత్యాధునిక వసతులతో కూడిన ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నారు. 2,691 చదరపు అడుగుల స్థల విస్తీర్ణంలో, 45 మీటర్ల ఎత్తుతో మొత్తం 12 అంతస్తుల టవర్ నిర్మాణం జరగనుంది. మొత్తం 28.44 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఒక్కో ఫ్లాట్ విలువ సుమారు 16 లక్షలుగా ఉంటుంది. కాంక్రీట్ నిర్మాణాల్లో అత్యంత నాణ్యమైన, వేగవంతమైన షీర్ వాల్ సాంకేతికతను ఉపయోగిస్తూ, రాబోయే 9 నెలల్లోనే నిర్మాణాన్ని పూర్తి చేసి బాధితులకు ఇళ్లను అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పట్టణాల్లోని పేదల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ధారావి మోడల్ లో ఈ అభివృద్ధి పనులు చేపడుతోంది. వేలంపేట స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ రాష్ట్రానికే ఒక రోల్ మోడల్ అని, మురికివాడల్లో నివసించే పేదలకు ఆ స్థలంలోనే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వడం ద్వారా వారికి ఆర్థిక, సామాజిక భద్రత చేకూరుతుందని నారాయణ చెబుతున్నారు. ఇదే నమూనాలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు పట్టణాలు, నగరాల్లోని మురికివాడలను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రచిస్తున్నామని వెల్లడించారు. దశాబ్దాలుగా మురికివాడల్లో అరకొర వసతులతో, అపరిశుభ్ర వాతావరణంలో బతికిన పేద కుటుంబాలకు విశాఖ నడిబొడ్డున 16 లక్షల విలువైన మోడల్ ఫ్లాట్ ఉచితంగా దక్కనుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విశాఖ నగరాన్ని మురికివాడలు లేని నగరంగా మార్చడానికి దోహదపడటమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రధాన నగరాల రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తుందని భావిస్తున్నారు.

# పాదయాత్రల సీజన్



ఏపీ, తెలంగాణలో వచ్చే ఏడాది పాదయాత్ర సీజన్ మొదలయ్యేలా కనిపిస్తోంది. ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను రాష్ట్రవ్యాప్తంగా 'పాదయాత్ర 2.0' చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని పార్టీ సెంట్రల్ ఆఫీసులో పర్చూరు నియోజకవర్గ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జగన్ పాల్గొన్నారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో తాను పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో వైసీపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడమే పాదయాత్ర లక్ష్యంగా పేర్కొన్నారు. గతంలో వైఎస్ జగన్ చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' ఆయన రాజకీయ జీవితంలోనే కీలకంగా మారింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తూ అధికారం సొంతం చేసుకున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పేరుతో ఏపీ ప్రభుత్వం డ్రాలు చేస్తుందని, ఇవన్నీ కోర్టులో చెల్లవని సీఎం చంద్రబాబుకు ముందే తెలుసునన్నారు. ా×= ప్రక్రియతో రాష్ట్రంలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, చంద్రబాబు ఉండగా ఎన్నికలు సజావుగా సాగే అవకాశమే లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని, ఎలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతున్నాయో అర్థం చేసుకుని వైసీపీ నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గట్టిగా పోరాటం చేసి ఎన్నికల్లో విజయాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. 2017 నవంబర్ 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ స్మృతి వనం నుంచి ప్రారంభమైన ఆ యాత్ర సుమారు 341 రోజుల పాటు సాగింది. అప్పటి మొత్తం 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాలు, 2,516 గ్రామాల మీదుగా 3,648 కిలోమీటర్లు చేసిన ఈ పాదయాత్రలో కోట్ల మంది ప్రజలను నేరుగా కలుసుకున్నారు. ఆ రోజుల్లో ప్రతిపక్ష నేతగా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, అన్ని వర్గాల సమస్యలను తెలుసుకున్న జగన్ 'నవరత్నాలు' సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించారు. ఈ ప్రజా సంకల్ప యాత్ర అందించినప్రజాదరణతోనే 2019 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు 'పాదయాత్ర 2.0' చేస్తానని జగన్ నిర్ణయం తీసుకున్నారు

# అంతరిక్షం అందరిదీ,.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి



అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు. 'శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది. వాతావరణ పరిస్థితుల అంచనా నుంచి పంటలు, సముద్రాలు, ప్రజల జీవనానికి సంబంధించిన అనేక అంశాల్లో అంతరిక్ష విజ్ఞానం కీలకంగా మారింది. అంతరిక్ష రంగంలో అవకాశాలు అపారమని, అదే సమయంలో బాధ్యత కూడా అందరిదే. కక్ష్యల్లో ఉపగ్రహాల సంఖ్య పెరుగుతున్న వేళ, సాంకేతికత మరింత శక్తిమంతంగా మారుతున్న సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారత్ అంతరిక్ష విధానం 'వసుధైవ కుటుంబకం' అనే భావనపై ఆధారపడి ఉంది. 'వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్' అనే స్ఫూర్తి ఇక భూగ్రహాన్ని దాటి అంతరిక్షానికి కూడా విస్తరించాలి. అంతరిక్షంలో లభించే శాస్త్రీయ సమాచారాన్ని పారదర్శకత, సమగ్రతతో మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలి' అని ప్రధాని మోదీ సూచించారు.

**రైతుల నుంచి మత్స్యకారుల వరకు ఇస్రో సేవలు**

భారత్ అంతరిక్ష ప్రయాణానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కేంద్రబిందువుగా ఉందని ప్రధాని తెలిపారు. అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యంతో పాటు తక్కువ వ్యయంతో విజయవంతమైన మిషన్లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. ఇస్రో సాంకేతికతలు కేవలం అంతరిక్ష పరిశోధనలకే పరిమితం కాలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం, మత్స్యకారులకు సముద్ర సంబంధిత సమాచారం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వంటి అనేక రంగాలకు అవి ఉపయోగపడుతున్నాయని వివరించారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కుపైగా ఉపగ్రహాలు అంతరిక్షంలోకి వెళ్లాయని ప్రధాని తెలిపారు. ఇస్రో సాంకేతికతలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తున్నాయని చెప్పారు.

**2035లో భారతీయ అంతరిక్ష కేంద్రం**

2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోదీ తెలిపారు. 2040 నాటికి భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని ప్రణాళిక రూపొందించుకున్నట్లు వెల్లడించారు.

అంతరిక్ష రంగంలో భారత్ సాధించే పురోగతి ప్రయోజనాలు మానవాళి మొత్తానికి చేరాలన్నదే తమ మార్గదర్శక సూత్రమని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ అంతరిక్ష విజయాలను ప్రస్తావించారు ప్రధాని మోదీ. చంద్రయాన్-3 మిషన్? ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీప ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్? నిలిచిందని తెలిపారు. సూర్యుడిపై అధ్యయనం కోసం చేపట్టిన ఆదిత్య-ఎల్1 మిషన్ సూర్యుడి రహస్యాలను ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. గతేడాది ఓ భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారని గుర్తుచేశారు.

**ప్రైవేట్ రంగానికీ పెద్దపీట**

ఇస్రోతో పాటు దేశంలోని ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ అన్నారు. వ్యాపార సంస్థల ఉత్సాహం, ఇస్రో సాంకేతిక నైపుణ్యంతో కలుస్తుండటంతో భారత అంతరిక్ష రంగంలో కొత్త శక్తి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇస్రోకు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న విశ్వాసం వెనుక తరతరాల భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల కఠోర శ్రమ ఉందని ప్రధాని కొనియాడారు. ఒక్కో మిషన్ విజయంతో వారు ఇస్రోకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. భారత్ అంతరిక్ష కార్యక్రమం ప్రారంభమైన 1960ల నుంచే ఫ్రాన్స్ విశ్వసనీయ భాగస్వామిగా ఉందని మోదీ తెలిపారు. భూ పరిశీలన నుంచి ఆధునిక సాంకేతికతల వరకు ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని మానవాళి ప్రయోజనాలతో అనుసంధానిస్తూ భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత్ తదుపరి అంతరిక్ష ప్రయాణంలో ఫ్రాన్స్‌తో పాటు ప్రపంచ దేశాలు 'సహ ప్రయాణికులు'గా మారాలని ఆహ్వానించారు.

# రిజిస్టర్డ్ పార్టీగా టీవీకే ఈసీ అధికారిక గుర్తింపు




నటుడు నుంచి రాజకీయ నాయకుడిగా మారిన తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ ఎన్నికల సంఘం కీలక గుర్తింపు ఇచ్చింది. ఆయన నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)ను తమిళనాడు, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా ఈసీ గుర్తించింది. అంతేకాదు, పార్టీకి 'విజిల్' ఎన్నికల గుర్తును కేటాయించింది. ఈ పరిణామంపై సీఎం విజయ్? హర్షం వ్యక్తం చేశారు. పార్టీకి అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీవీకే రాజకీయ ప్రస్థానంలో ఇది కీలక మైలురాయిగా అభివర్ణించారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన టీవీకే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను విజయ్ ప్రస్తావించారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ ఎదుగుదలను అపూర్వ అద్భుతంగా అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు రావడం ద్వారా టీవీకేను అతిపెద్ద పార్టీగా ప్రజలు నిలబెట్టారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తూ, ప్రజాస్వామ్య శక్తుల సహకారంతో నిజాయితీ, అవినీతి రహిత పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తమపై ప్రజల ఉంచిన నమ్మకాన్ని నిరంతర ప్రజాసేవ ద్వారా నిలబెట్టుకుంటానని తెలిపారు.

**'లౌకిక సామాజిక న్యాయమే మార్గం'**

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే పాలన అందించడమే తమ లక్ష్యమని విజయ్? పేర్కొన్నారు. పారదర్శక పాలన, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమం తమ ప్రభుత్వ విధానాల్లో కీలకంగా ఉంటాయని స్పష్టం చేశారు. టీవీకే రాజకీయ సిద్ధాంత మార్గంలో లౌకికి సామాజిక న్యాయంకు ప్రాధాన్యత ఉంటుందని విజయ్? తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తామని చెప్పారు. పార్టీ తొలి ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయడంలో కీలకంగా పనిచేసిన తమిళ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, ప్రచార నిర్వాహకులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

2024లో పార్టీని ప్రారంభించారు విజయ్. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు విజిల్? గుర్తు ఈసీ కేటాయించింది. ఇప్పుడు ఎన్నికల్లో సాధించిన ఘన విజయంతో అదే గుర్తును శాశ్వతంగా ఖరారు చేసింది. దీంతో ఇకపై జరిగే ఏ ఎన్నికల్లోనైనా ఇదే గుర్తుపై టీవీకే పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడు ఇప్పటికే డీఎంకే , ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, డీఎండీకే వంటి పార్టీలు అధికారిక గుర్తింపు పొందాయి. తాజాగా విజయ్? పార్టీ టీవీకే కూడా ఆ వాటి సరసన చేరింది. దీంతో రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరింది.

**విజయ్ నాయకత్వంలో కూటమి**

ఇదిలా ఉండగా బుధవారం టీవీకే నేతృత్వంలో కొత్త కూటమి ఆవిర్భవించింది. దీనికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్"అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న టీవీకే ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, తమిళనాడు హక్కుల పరిరక్షణ లక్ష్యాలుగా ఈ కూటమి పనిచేస్తుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. రానున్న ఉప ఎన్నికల్లో కొత్త కూటమి పేరుతో ఉమ్మడిగా పోటీ చేస్తామని ప్రకటించారు. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) నాయకులు హాజరయ్యారు. కొత్త కూటమిలో టీవీకేతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ ఉన్నాయి. కూటమి భవిష్యత్ సంస్థాగత నిర్మాణం, ఉమ్మడి కార్యక్రమం, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయ వ్యవస్థ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.

# ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..

ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను




స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..



చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం



సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే పిల్లల భద్రతకు మరింత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్?ఫామ్?లు నేరుగా ఒప్పందాలు చేసుకోకుండా తగిన నియంత్రణలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం, కేంద్రం, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. భారత్‌లో కొన్ని రక్షణ చర్యలు అవసరమని విచారణ సందర్భంగా ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు ఈ పిటిషన్?ను దాఖలు చేసింది. సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది హెచ్?ఎస్? ఫూల్కా వాదనలు వినిపించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వయసు నిబంధనలు, భారత చట్టాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పిటిషన్?లో ప్రధానంగా ప్రస్తావించారు. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి కొన్ని వేదికలు 13 ఏళ్ల వయసు నుంచే ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పిస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారంతా మైనర్లుగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలు డిజిటల్ వేదికలపైకి ప్రవేశించినప్పుడు వారి వయసును సక్రమంగా నిర్ధారించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడం, ప్రమాదకర కంటెంట్ నుంచి వారిని కాపాడటం వంటి అంశాలపై స్పష్టమైన నియమాలు అవసరమని పిటిషన్ పేర్కొంది.

**సీఎస్ఏఎం కట్టడికి మరింత పటిష్ఠ చర్యలు**

చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ (జుజుూవీ)కు సంబంధించి దేశంలో కఠినమైన శిక్షా నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడంలో డిజిటల్ వేదికలు విఫలమవుతున్నాయని పిటిషన్‌లో ఆరోపించారు. పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టరింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలని, అలాగే వినియోగదారుల వయసును నిర్ధారించే సమర్థమైన విధానం ఉండాలని కోరారు.

**తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయాలని పిటిషన్**

18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండా నిబంధనలు రూపొందించాలని పిటిషన్ కోరింది. మైనర్ డిజిటల్ సేవలను వినియోగించాల్సిన పరిస్థితి ఉంటే తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకుడి అనుమతి తప్పనిసరి చేయాలని సూచించింది. అలాంటి అనుమతి ఇచ్చే వ్యక్తి నిజంగా తల్లిదండ్రి లేదా చట్టబద్ధ సంరక్షకుడేనా అన్నది గుర్తింపు ధ్రువీకరణ లేదా ఈ-కేవైసీ ద్వారా నిర్ధారించే విధానం ఉండాలని కోరింది. ఇందుకోసం 2021లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమాల్లో మార్పులు చేయాలని లేదా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

బాలల కిడ్నాప్ కేసుల దర్యాప్తుకు దేశవ్యాప్తంగా ఒకే విధానం

అలాగే పిల్లల కిడ్నాప్?, అపహరణ కేసుల దర్యాప్తుపై దాఖలైన మరో ప్రజాప్రయోజన వ్యాజ్యంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. ఇలాంటి కేసుల దర్యాప్తు కోసం దేశవ్యాప్తంగా ఒకే విధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్?పై కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అడ్వొకేట్ ఆన్ రికార్డ్ అశ్వని కుమార్ దూబే ద్వారా పిటిషన్ సమర్పించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిల్లలు కనిపించకుండా పోయినప్పుడు, కిడ్నాప్ లేదా అపహరణకు గురైనప్పుడు పోలీసులు వెంటనే స్పందించేలా ప్రత్యేక విధానం రూపొందించాలని పిటిషన్ కోరింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఒకే తరహా స్టాండర్డ్ ప్రశ్నావళి, ప్రత్యేక దర్యాప్తు విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేసింది. కిడ్నాప్, అపహరణ కేసుల దర్యాప్తును కనీసం ఏసీపీ లేదా ఎస్‌హెచ్‌వో స్థాయి అధికారి పర్యవేక్షించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. కేసుల దర్యాప్తును నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసేలా వ్యవస్థ ఉండాలని పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తులో జాప్యం జరిగితే అపహరణకు గురైన చిన్నారులను సురక్షితంగా గుర్తించి తిరిగి తీసుకురావడంలో అవకాశాలు తగ్గుతాయని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో పిల్లలు అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, బలవంతపు శ్రమ, అక్రమ దత్తత వంటి ప్రమాదాలకు గురయ్యే ముప్పు పెరుగుతుందని తెలిపారు. కిడ్నాప్, అపహరణ కేసుల వేగవంతమైన విచారణ కోసం ఎంపీలు, ఎమ్మెల్యేల కేసుల విచారణకు ఉన్న ప్రత్యేక కోర్టుల తరహాలో ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని పిటిషన్ కోరింది. ఇలాంటి కేసులను ఏడాదిలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.



# టీమిండియాకు దూరమైన తర్వాత ఆకలి పెరిగింది

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయానికి జట్టు సమష్టి కృషి, ఐక్యతే కారణమని కెప్టెన్ ఇషాన్ కిషన్ చెప్పాడు. "ఈ విజయం మా అందరిదీ. ఒకరికొకరం అండగా నిలిచాం. అదే ఈ జట్టు బలం. నాయకుడిగా నేను కూడా నా వంతు బాగానే చేశాననుకుంటా" అంటూ ఇషాన్ నవ్వుతూ చెప్పాడు. అయితే విజయంతో ప్రయాణం ముగియదని అన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు. ఫైనల్లో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 270 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌కు విజయం ఖాయమైంది. దీంతో 2012-13 సీజన్ తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీని గెలుచుకుంది. జాతీయ జట్టుకు దూరంగా ఉన్న సమయంలో తనలో చాలా మార్పు వచ్చిందని ఇషాన్ చెప్పాడు. ఇప్పుడు మరింత ప్రశాంతంగా ఉంటున్నానని, పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటున్నానని చెప్పాడు. జట్టు కోసం ఆడాలనే ఆకలి తనలో మరింత పెరిగిందన్నాడు. జట్టు కోసం ఆడడం, టైటిల్ గెలవడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఇషాన్‌కు ఇది రెండో దేశవాళీ టైటిల్. 2025-26 సీజన్‌లో సొంత రాష్ట్రం ఝార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు.




# 2027 ప్రపంచకప్ వరకు చూద్దాం

## గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో రోహిత్

2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతోంది. దీనిపై రోహిత్ తాజాగా స్పందించాడు. అయితే తన నిర్ణయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న రోహిత్‌ను ఓ అభిమాని ఇదే విషయంపై ప్రశ్నించాడు. 2027 అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతారా? అని అడిగాడు. దీనికి "2027 అక్టోబర్ చాలా దూరంలో ఉంది. అప్పటికి చూద్దాం" అని రోహిత్ బదులిచ్చాడు. దీంతో ప్రపంచకప్ ఆడే విషయంపై రోహిత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టమైంది. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇదే కార్యక్రమంలో.. 2027 ప్రపంచకప్‌ను భారత్ గెలిస్తే 2024 టీ20 ప్రపంచకప్ విజయోత్సవంలా ముంబైలో బస్ పరేడ్ నిర్వహిస్తారా? అని రోహిత్‌ను అడిగారు. "ఇప్పుడు బస్ పరేడ్ సాధ్యమవుతుందని అనుకోవడం లేదు" అని సరదాగా స్పందించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గతంలో కొట్టిపారేశారు. రోహిత్ అద్భుతంగా ఆడుతున్నప్పుడు అతడి ఎంపికపై సందేహాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి వన్డేలో రోహిత్ 138 పరుగులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఊహాగానాలకు తాను ఆజ్యం పోయనని చెప్పారు.

# దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌గా ఈస్ట్ జోన్..!

- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఘనవిజయం
- 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు పడిన తెర






చెన్నై వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ చారిత్రక విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్‌ను నెట్టివేసి ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఏకంగా 13 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈస్ట్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్.. 708 పరుగులు చేసింది. అనంతరం సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌట్ అయింది. ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 388/7 వద్ద డిక్లేర్ చేసింది. ఇక మ్యాచ్ ఫలితం తేలేలా కనిపించకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలో సంబరాల్లో మునిగిపోయారు. ఈస్ట్ జోన్ చారిత్రాత్మక విజయంలో ఆ జట్టు కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రధానపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగుల ద్విశతకంతో విరుచుకుపడిన ఇషాన్, రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులతో మెరిశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సౌత్ జోన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు ఆఖరి రోజున యువ బ్యాటర్ మహమ్మద్ కౌనైన్ ఖురైషి అద్భుతమైన సెంచరీతో నాటౌట్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. విజయం సాధించిన తర్వాత ఈస్ట్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఇషాన్ కిషన్, టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీలు చేతిలో వికెట్ స్టంప్‌లు పట్టుకుని గ్రౌండ్ చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. పిచ్‌పై డ్యాన్స్ చేస్తూ తమ విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఈ విజయం ఈస్ట్ జోన్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైనదిగా నిలిచిపోనుంది.ఈ మ్యాచ్ ఫలితం ఇప్పటికే తేలిపోయినప్పటికీ, సౌత్ జోన్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ చూపించిన క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది. ఉక్కపోత, తీవ్రమైన అలసట ఉన్నప్పటికీ ఫలితం మారదని తెలిసినా సిరాజ్ వరుసగా 9 ఓవర్లు బౌలింగ్ చేసి తన నిబద్ధతను చాటుకున్నాడు. ఇక సౌత్ జోన్ తరఫున ఒంటరి పోరాటం చేసిన యంగ్ సెన్సేషన్ తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. రెండు ఇన్నింగ్స్?ల్లోనూ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. అతడు మొదటి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 80 పరుగులు చేశాడు. అలాగే సౌత్?జోన్?కు కెప్టెన్?గా వ్యవహరించిన తిలక్ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.మ్యాచ్ అనంతరం ఇషాన్ కిషన్ తమ జట్టు వ్యూహం గురించి వివరించాడు. "జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నప్పుడు ముందుగా పరిస్థితులను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మేం రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేశాం. దీంతో ఈ మ్యాచ్? ఫలితాన్ని తేల్చేది మొదటి ఇన్నింగ్సే అని మాకు అర్థమైంది. కాబట్టి, ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోర్?కు ఆలౌట్ చేసి లీడ్ సాధించడమే మా లక్ష్యం. అయితే మ్యాచ్?లో విజయం సాధించే విధంగా తొలి ఇన్నింగ్స్?లో మాకు లీడ్ వచ్చింది. దీంతో ఇంతటి తీవ్రమైన ఎండలో మేం మళ్లీ మైదానంలోకి ఎందుకు దిగాలని అనుకుంటాం?" అని ఇషాన్ చెప్పాడు.

# అఫ్గాన్, ఆసియా గేమ్స్ భారత జట్టులో మార్పులు

- గాయంతో దూరమైన పేసర్ హర్షిత్ రాణా
- జట్టులో చోటు సంపాదించిన యష్ ఠాకూర్



అఫ్గనిస్థాన్‌తో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్, ఆ తర్వాత జరగనున్న ప్రతిష్ఠాత్మక ఆసియా గేమ్స్ కోసం భారత జట్టులో బీసీసీఐ కీలక మార్పు చేసింది. గాయం కారణంగా జట్టుకు దూరమైన యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్థానంలో విదర్భ పేసర్ యష్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు. గత జులైలో జింబాబ్వే పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యష్‌కి ఇది రెండో టీ20 సిరీస్ కావడం విశేషం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహ్యాబిలిటేషన్ పొందుతున్న హర్షిత్ రాణాకు మరోసారి తీవ్ర గాయమైంది. సెప్టెంబర్ 7న జరిగిన మ్యాచ్ సిమ్యులేషన్ సందర్భంగా బౌలింగ్ చేస్తుండగా అతడికి రెక్టస్ ఫెమోరిస్ (తొడ ముందు భాగం) కండరం పట్టేసిందని బీసీసీఐ వైద్యాధికారులు ధృవీకరించారు. గతంలో తొడపిక్క గాయంతో బాధపడిన రాణా, కోలుకునే క్రమంలోనే ఈ కొత్త గాయం బారిన పడటంతో అఫ్గన్ సిరీస్‌తో పాటు ఆసియా గేమ్స్‌కు కూడా పూర్తిగా దూరమయ్యాడుడొమెస్టిక్ క్రికెట్‌లో సయ్యద్ మ-ుస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 18 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు యష్ ఠాకూర్ . ఆపై జింబాబ్వే పర్యటనలో 2 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టాడు. డెత్ ఓవర్లలో కచ్చితమైన యార్కర్లు వేయగల సామర్థ్యం ఉన్న యష్ రాకతో భారత పేస్ విభాగం బలంగా మారింది. సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే అఫ్గన్ సిరీస్ పూర్తయ్యాక, ఆసియా గేమ్స్‌కు ముందు భారత్ ఒక చారిత్రక మ్యాచ్‌లో జపాన్‌తో కూడా తలపడనుంది.మరోవైపు ఫిట్‌నెస్ నిరూపించుకున్న స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లను బీసీసీఐ అప్‌డేటెడ్ స్క్వాడ్‌లోకి అధికారికంగా చేర్చింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా భారత జట్టు బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత ఆసియా గేమ్స్ జరగనున్నాయి.

# ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించిన శీతల్ దేవి




భారత పారా ఆర్చర్ శీతల్ దేవీ మరోసారి సత్తా చాటింది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్నవరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026లో ఆమె స్వర్ణం ముద్దాడింది. కాంపౌండ్ ఈవెంట్‌లో బరిలో దిగిన శీతల్ ఫైనల్?లో కజికిస్థాన్‌కు చెందిన బజాదా సీడన్‌తో పోటీపడింది. అయ-ితే ఇద్దరూ పోటీపోటీగా ఆడడంతో ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో ఇరువురు 144-144తో సమంగా నిలిచారు. అనంతరం ఆట షూట్-ఆఫ్‌కు వెళ్లింది. అక్కడ శీతల్ 10 - 9తో తేడాతో విజయం సాధించి పసిడి పతకం పట్టేసింది. కాగా, వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్‌లో శీతల్‌కు ఇదే తొలి వ్యక్తిగత స్వర్ణ పతకం.మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ శీతల్ పతకం ముద్దాడింది. ఆమె తోమన్ కుమార్‌తో కలిసి కాంస్య పతకం సాధించింది. కాంస్య పతక పోరులో ఈ భారత ద్వయం 157-145 తేడాతో ఇరాక్ జోడీ సారా అల్-హమీద్?ను ఓడించింది. ఇక పారా రికర్వ్ మహిళల వ్యక్తిగత విభాగంలో భావన కాంస్యం నెగ్గింది. ఆమె భారత్‌కే చెందిన రాజశ్రీ రాథోడ్‌ను 6- 0 తేడాతో ఓడించి కాంస్య పతకం అందుకుంది.పారా కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో సరిత 141- 140 తేడాతో చైనా షూటర్ వాంగ్ హ్యుటింగ్‌పై నెగ్గి కాంస్య పతకం ముద్దాడింది. పారా కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తోమన్ కుమార్ 143-138 తేడాతో ఇరాక్? పారాఅథ్లెట్ అబ్బాన్ కాధిమ్‌పై నెగ్గి కాంస్య పతకం గెలిచాడు. మరోవైపు, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో రెండుసార్లు పారాలింపిక్స్ మెడల్ విన్నర్ హర్విందర్ సింగ్-భావన 6-0 తేడాతో చైనా జోడీ లియాంగ్ కియురోంగ్-షియా లేపై నెగ్గి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. కాగా, ఈ వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026 స్టేజ్ 3ను భారత్ మొత్తం 15 పతకాలతో ముగించింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, మూడు రజతాలు, ఎనిమిది కాంస్యాలు ఉన్నాయి.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు
PEN SATTA Telugu Daily
శుక్రవారం 11 సెప్టెంబర్ 2026


## సంపాదకీయం

## చమురు యుద్ధ సవాలు!

నిత్యం అశాంతితో సతమతమయ్యే ప్రాంతం మధ్యప్రాచ్యం. మతపరమైన ఘర్షణలు, అగ్రరాజ్యాల మధ్య విభేదాలు, పైగా చమురు.. ఇవే ఈ ప్రాంతాన్ని నిరంతరం వార్తల్లో ఉంచుతున్నాయి. వాషింగ్టన్ సైనిక చర్యల కంటే ఆర్థిక దిగ్బంధనంపైనే దృష్టి సారించి కొన్ని వారాలు ప్రశాంతంగా గడిచిన తర్వాత, ఈ ప్రాంతం మళ్లీ వేడెక్కింది. తాజాగా అమెరికా సైన్యం ఐదు ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడి చేసింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం.."గత రెండు రోజుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో అమెరికా నౌకాదళ యుద్ధనౌకను లక్ష్యంగా చేసుకున్న తర్వాతే" ఈ దాడి జరిగింది. ఇరాన్ చేసిన దాడి ప్రయత్నాలను అమెరికా యుద్ధనౌక విజయవంతంగా తప్పించుకుని, ప్రాంతీయ జలాల్లో గస్తీని కొనసాగించింది. ఏ అమెరికా సిబ్బందికీ హాని కలగలేదని కూడా సెంట్‌కామ్ తెలిపింది. దీనికితోడు, జోర్డాన్‌వైపు ఇరాన్ దాదాపు 20 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి, రెండు అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందనీ నివేదికలున్నాయి. యెమెన్‌లోని తెహ్రాన్ అనుకూల హూతీలు కూడా ఇజ్రాయెల్‌వైపు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. సౌదీ అరేబియాపైనా వరుస దాడులకు పాల్పడి, చమురు కేంద్రాలు, ఇతర సదుపాయాల్లో మంటలు రేపారు. ఈ పరిణామాలన్నీ కలిసి, పశ్చిమాసియా ఒక్కసారిగా బహుళ కేంద్రాల యుద్ధరంగంగా మారుతున్నట్టు స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్-అమెరికా ప్రత్యక్ష ఘర్షణ ఒకవైపు కొనసాగుతుండగా, హూతీలు-సౌదీ, హూతీలు-ఇజ్రాయెల్ అనుబంధ సంఘర్షణలు మరోవైపు అదే సమయంలో రాజుకుంటున్నాయి. ఈ ఘర్షణ కొంతకాలం ఇదే స్థితిలో కొనసాగే అవకాశముంది. కారణం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేలపై అమెరికా సైనికులను దించి పూర్తిస్థాయి యుద్ధానికి ఇష్టపడకపోవడమే. అమెరికా అనేకసార్లు చేసిన 'శాశ్వత యుద్ధాల'కు ఆయన వ్యతిరేకతతో ఇది అనుగుణంగానే ఉంది. దూరదేశాల్లో వనరులను హరించి, యువ సైనికులను బలిగొంటున్న అమెరికా యుద్ధాలను ఆయన ప్రధాన మద్దతుదారులైన 'మాగా' వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దీనికితోడు, ఆయన రిపబ్లికన్ పార్టీ త్వరలో మధ్యంతర ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. పూర్తిస్థాయి భూతల యుద్ధంలోకి దిగితే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించాలని ట్రంప్‌నకు స్పష్టంగా తెలుసు. అదే సమయంలో, ఇరాన్‌ను పూర్తిగా వదిలేయడానికీ ట్రంప్ ఇష్టపడటం లేదు. ఎందుకంటే అలా చేస్తే, తన పరిపాలన బలహీనమైనదిగా, రాజీపడే స్వభావం కలిగినదిగా ప్రత్యర్థులు చిత్రీకరించే ప్రమాదముంటుంది. అందుకే, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఈ యుద్ధం.. దాడులు, ప్రతిదాడులు, తాత్కాలిక విరామాలు, మళ్లీ ఉద్రిక్తతలు అనే చక్రాన్ని కొనసాగుతోంది. ఈ పరిస్థితే ముడిచమురు ధరలను ప్రభావితం చేసి.. ఆరు వారాల గరిష్ఠస్థాయికి చేరింది. బ్రెంట్ ఫ్యూచర్స్ 100 డాలర్ల మార్కును దాటాయి. ముడిచమురు దిగుమతులపై మనకున్న భారీ ఆధారపడటం కారణంగా, ప్రభుత్వం తన టాప్-5 సరఫరాదారుల కూర్పును మార్చింది. అమెరికా, నైజీరియా స్థానంలో బ్రెజిల్, వెనెజువెలా చేరాయి. రష్యా, సౌదీ అరేబియా, యూఏఈ మాత్రం అగ్రగామి ముడిచమురు విక్రేతలుగా కొనసాగుతున్నాయి. ఈ మార్పు, భారత్ తన సరఫరా వనరులను వైవిధ్యీకరించడంలో చూపుతున్న వ్యూహాత్మక చురుకుదనానికి నిదర్శనమే అయినా, ఇది కేవలం తాత్కాలిక సర్దుబాటే. మూలాధార సమస్య, అంటే దిగుమతులపై అధిక ఆధారపడటం అలాగే మిగిలివుంది!

దిగుమతి చేసుకున్న ముడిచమురుపై దేశం అధికంగా ఆధారపడటాన్ని (దాదాపు 88 శాతం) కనీసం తగ్గించడానికి స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలను ప్రభుత్వం రూపొందించుకోవాలి. స్వల్పకాలంలో, సరఫరా వనరులను వైవిధ్యీకరించడం, తగినంత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను నిర్మించడం, వేర్వేరు మార్కెట్లనుంచి ముడిచమురు కొనుగోలు కొనసాగించడం ప్రాధాన్యతగా ఉండాలి. దీనివల్ల భౌగోళిక- రాజకీయ అంతరాయాలు తక్షణమే దేశీయ ధరల షాక్‌లుగా మారకుండా ఉంటాయి. ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలతో ద్వైపాక్షిక ఇంధన భాగస్వామ్యాలను బలోపేతం చేసుకుని, పోటీ ధరలకు దీర్ఘకాలిక ఒప్పందాలు అన్వేషించాలి. మధ్యకాలంలో, భారత్ మరింత శుభ్రమైన, సమర్థవంతమైన ఇంధన వనరులవైపు పరివర్తనను వేగవంతం చేయాల్సి ఉంది. ఎలక్ట్రిక్ వాహనాలు, ప్రజా రవాణా, జీవ ఇంధనాలు, సహజవాయువు, సౌర, పవన శక్తిపై మరింత పెట్టుబడి, దిగుమతి చేసుకున్న పెట్రోలియంపై డిమాండ్‌ను క్రమంగా తగ్గించగలదు. అదే సమయంలో, పర్యావరణ పరిరక్షణలకు రాజీ పడకుండా, స్థిరమైన విధానాలు, వేగవంతమైన అనుమతులు, సముచిత ప్రోత్సాహకాల ద్వారా దేశీయ అన్వేషణ, ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దీర్ఘకాలిక సమాధానం, ఆర్థిక వ్యవస్థ యొక్క శిలాజ ఇంధనాలపై నిర్మాణాత్మక ఆధారపడటాన్ని తగ్గించడంలోనే ఉంది. భారత్ పునరుత్పాదక ఇంధనం, బ్యాటరీ నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, ఇతర ఉద్భవిస్తున్న సాంకేతికతలను విస్తరించాలి. విస్తృత, మరింత స్థితిస్థాపక ఇంధన మిశ్రమం, కేవలం దిగుమతి బిల్లును తగ్గించడమే కాకుండా, యుద్ధాలు, ఆంక్షలు, అస్థిర ప్రపంచ చమురు ధరలనుంచి ఆర్థిక వ్యవస్థను రక్షిస్తుంది కూడా. ఇరాన్ సంక్షోభం మరింత తీవ్రతరం అవుతున్న ఈ తరుణంలో, భారత్ కేవలం స్వల్పకాలిక సర్దుబాట్లతోనే సరిపెట్టుకోకుండా, దీర్ఘకాలిక ఇంధన భద్రతా వ్యూహాన్ని రూపొందించాలి. ఎందుకంటే మధ్యప్రాచ్యంలో ఇలాంటి ఉద్రిక్తతలు భవిష్యత్తులోనూ పునరావృతమయ్యే పరిస్థితే. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగదారుగా ఉన్న భారత్‌కు, ఇలాంటి భౌగోళిక-రాజకీయ సంక్షోభాలు కేవలం విదేశాంగ విధాన సమస్యలు మాత్రమే కాదు, నేరుగా సామాన్య పౌరుడి జేబును ప్రభావితం చేసే ఆర్థిక వాస్తవికతలు కూడా! పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల రవాణా వ్యయాలను పెంచి, నిత్యావసర వస్తువుల ధరలపైనా ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దీనివల్ల ద్రవ్యోల్బణం, ద్రవ్య లోటుపైనా ఒత్తిడి పెరుగుతుంది. అందుకే, కేవలం స్వల్పకాలిక దౌత్యపరమైన సర్దుబాట్లతో సరిపెట్టుకోకుండా, ఇంధన స్వావలంబన దిశగా నిర్మాణాత్మక, దీర్ఘకాలిక సంస్కరణలను చేపట్టడమే భారత్ ముందున్న అత్యంత తెలివైన, స్థిరమైన మార్గం. ఈ దిశగా ఇప్పటికే ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమైనవే అయినా, వాటి వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితులు స్పష్టంగా సూచిస్తున్నాయి. చివరిగా, ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్పిడి ఇప్పటికే వేగంగా జరుగుతున్న తరుణంలో, భారత్ కూడా ఈ మార్పులో ముందంజలో నిలిచేలా చూసుకోవడమే, భవిష్యత్తులో ఇలాంటి ప్రతి భౌగోళిక-రాజకీయ సంక్షోభం నుంచి తనను తాను రక్షించుకునే అత్యుత్తమ మార్గంగా నిలుస్తుంది!

## పనికొచ్చే పలుకు




## లక్ష్య సాధనకు ఓపిక పట్టాలి!

ఇంటర్నెట్ మన జీవితాలను సులభతరం చేయడమే కాకుండా, మన అలవాట్లను, ఓర్పునూ మార్చేసింది. ఒకప్పుడు ఎవరితోనైనా మాట్లాడాలంటే ఓపికగా ఉండేవాళ్లం. ఉత్తరం రాయాలంటే వారాలు పట్టేది. తిరిగి జవాబు రావాలంటే.. మరిన్ని వారాలు ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రిప్లై ఆలస్యమైతేనే ఏదో జరిగిపోయిందని కంగారు పడుతున్నాం. ఖాళీ దొరికితే చాలు ఆటోమేటిక్‌గా ఫోన్ చూస్తున్నాం. సమాచారం, వినోదం ఇలా ప్రతిదీ వెంటనే రావాలనుకోవడం మనలోని సహనం అనే గొప్ప గుణాన్ని పూర్తిగా తగ్గించేస్తోంది. రచయిత్రి జాయిస్ మేయర్ చెప్పిన ఒక ప్రసిద్ధ మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి: *Patience is not the ability to wait, but the ability to keep a good attitude while waiting.* అంటే, ఓపిక అంటే కేవలం వేచి చూడగలగడం కాదు, వేచి చూస్తున్నప్పుడు మంచి మనోభావాన్ని కొనసాగించగలగడం. కానీ మనం కొద్దిపాటి వేచి చూడాల్సిన సమయంలోనూ ఆందోళన, చిరాకు, అసహనానికి లోనవుతున్నాం. అంటే, సమస్య వేచి చూడటంలో లేదు, వేచి చూసేటప్పుడు మన మనసు ఎలా స్పందిస్తుందన్నదే అసలైన సవాలు. ఈ మార్పు వెనుక ఉన్న శాస్త్రీయ కారణాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రతిసారీ నోటిఫికేషన్ వచ్చినప్పుడు, మెసేజ్‌కు రిప్లై వచ్చినప్పుడు, మన మెదడులో డోపమైన్ అనే 'ఆనంద హార్మోన్' విడుదలవుతుంది. ఇది మళ్లీ మళ్లీ ఫోన్ చూడాలని కోరుకునేలా చేస్తుంది. దీర్ఘకాలంలో ఇది మెదడు నిర్మాణాన్నే మారుస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. నిదానంగా ఆలోచించే సామర్థ్యం తగ్గి, తక్షణ సంతృప్తి కోసం అర్రులు చాచే ధోరణి పెరుగుతుంది. దీన్నే మనస్తత్వశాస్త్రంలో 'ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్ ట్రాప్' అంటారు. ఈ మార్పు మన జీవితంపై చూపే ప్రభావం అనేక రూపాల్లో కనిపిస్తుంది. సంబంధాల్లో, ఎవరైనా మెసేజ్‌కు వెంటనే స్పందించకపోతే ప్రతికూల అర్థాలు తీసుకుంటాం. "నన్ను పట్టించుకోవడం లేదు", "ఏదో తప్పు జరిగింది" అని ఆందోళన చెందుతాం. ఎందుకంటే మనసు తక్షణ ఫలితాల కోసం ఆరాటపడుతుంది. వ్యక్తిగత ఎదుగుదలలో, నైపుణ్యాలు నేర్చుకోవడానికి, అలవాట్లను మార్చుకోవడానికి అవసరమైన సమయాన్నివ్వకుండా, ఫలితాలు కనిపించకపోతే మధ్యలోనే వదిలేస్తాం.

ఈ పరిస్థితిని మార్చుకోవడానికి కొన్ని ఆచరణాత్మక మార్గాలు ఉన్నాయి. మొదటిది.. రోజులో కొన్ని నిర్దుష్ట సమయాల్లో మాత్రమే ఫోన్ నోటిఫికేషన్లను చూడండి. నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం లేదని మీ మెదడుకు నేర్పించండి. రెండోది.. ఉద్దేశపూర్వకంగా వేచి చూసే అభ్యాసం చేయండి. క్యూలో నిలబడినప్పుడు వెంటనే ఫోన్ తీయకుండా, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించండి. మూడోది.. దీర్ఘకాలిక లక్ష్యాలను చిన్న మైలురాళ్లుగా విభజించి, ప్రతి చిన్న పురోగతినీ జరుపుకోండి. ఇది తక్షణ సంతృప్తి కోరికను ఆరోగ్యకరమైన రీతిలో తీర్చుతుంది. నాలుగోది, రోజుకు కొంత సమయం పూర్తిగా డిజిటల్ పరికరాలకు దూరంగా గడపండి - పుస్తకం చదవడం, నడక వంటివి మెదడుకు నిదానంగా ఆలోచించే అలవాటును తిరిగి నేర్పిస్తాయి. గుర్తుంచుకోండి -ఓపిక పుట్టుకతో వచ్చే గుణం కాదు, అభ్యాసంతో సాధించే నైపుణ్యం. ఇంటర్నెట్ మనకు వేగాన్ని ఇచ్చినా, జీవితంలో నిజంగా విలువైనవన్నీ - మంచి సంబంధాలు, లోతైన జ్ఞానం, స్థిరమైన విజయం - సమయం తీసుకునేవే. వేచి చూడాల్సిన క్షణాల్లో మీ మనోభావాన్ని ప్రశాంతంగా ఉంచుకోగలిగితే, అదే మీ నిజమైన శక్తిగా మారుతుంది.

# కావాల్సింది.. ప్రజా విశ్వాసమే!




భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ ఒక బలమైన రాజకీయ శక్తిగా కొనసాగుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఆయన వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఆయనకున్న జాతీయస్థాయి ప్రజాదరణకు నిదర్శనం. అయితే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న నాయకత్వానికి ప్రజల అంచనాలు కూడా అంతే స్థాయిలో పెరుగుతాయి. ఇటీవల వెలువడిన India Today-CVoter Mood of the Nation సర్వేలో తదుపరి ప్రధానిగా మోదీని 48.7 శాతం ఎంచుకోగా, రాహుల్‌గాంధీకి 27.1 శాతం మద్దతు లభించింది. గతంతో పోలిస్తే మోదీ మద్దతు తగ్గినప్పటికీ, ఆ మేరకు ప్రతిపక్షానికి ప్రయోజనం చేకూరలేదు. ఇదే ప్రస్తుత జాతీయ రాజకీయ చిత్రంలో ముఖ్యమైన అంశం. మోదీకి ప్రత్యామ్నాయంగా ఒకే నాయకత్వం ఇంకా బలపడలేదన్నది ఆయనకు రాజకీయంగా అనుకూలం. అదే సమయంలో మద్దతులో వచ్చిన తగ్గుదల అధికారంలో ఉన్న నాయకత్వం ప్రజా అంచనాలను నిర్లక్ష్యం చేయరాదన్న హెచ్చరిక. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయి మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడం కూడా ఓటర్ల తీర్పులో వచ్చిన మార్పును సూచించింది. పదేళ్ల పాలన తర్వాత ప్రజలు ప్రభుత్వ పనితీరును గత విజయాలతో కాకుండా తమ ప్రస్తుత అనుభవాలతో కొలుస్తున్నారు. మౌలిక వసతులు, డిజిటల్ పరివర్తన, సంక్షేమ పథకాలు, ఆరోగ్యం, విద్య, రహదారులు, రైల్వేలువంటి రంగాల్లో పురోగతి ఉన్నప్పటికీ, ఉద్యోగాలు, ధరలు, కుటుంబ ఆదాయం, చిన్న వ్యాపారాల పరిస్థితి, యువత భవిష్యత్తువంటి అంశాలు మరింత ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయి. అందువల్ల మోదీ ముందున్న అసలు సవాలు 'ఇమేజ్'ను కాపాడుకోవడం కాదు.. పాలనలో సాధించిన విజయాలను ప్రజల జీవితాల్లో కనిపించే ఫలితాలుగా మార్చడం. ముఖ్యంగా యువతకు ఉపాధి, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, తయారీ రంగం విస్తరణ, మధ్యతరగతికి ఉపశమనం, రైతుకు స్థిరమైన ఆదాయంవంటి అంశాల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలి. బలమైన నాయకత్వం నిర్ణయాత్మకతతో పాటు ప్రజల మాట వినే సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించాలి. విమర్శలను స్వీకరించడం, అవసరమైన చోట విధానాలను సవరించడం, పాలనలో జవాబుదారీతనాన్ని పెంచడం ద్వారా మాత్రమే దీర్ఘకాలిక ప్రజా విశ్వాసం మరింత బలపడుతుంది.

దేశీయ రాజకీయాలతోపాటు అంతర్జాతీయ వేదికపైనా మోదీకి బాధ్యతలు పెరిగాయి. గత దశాబ్దంలో జీ20, బ్రిక్స్, క్వాడ్‌వంటి వేదికల్లో భారత పాత్ర విస్తరించింది. అమెరికా, రష్యా, యూరప్, పశ్చిమాసియా, ఇండో-పసిఫిక్ దేశాలతో సంబంధాలను సమతుల్యం చేస్తూ భారత్ తన వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని పెంచుకుంది. ప్రపంచంలో భారత్ ఎదుగుతున్న శక్తిగా గుర్తింపు పొందుతున్న సమయంలో ఈ దౌత్యపరమైన స్థానం కీలకమే. కానీ అంతర్జాతీయ ప్రతిష్ఠకు పునాది దేశీయ ఆర్థిక బలం. పెట్టుబడులు, తయారీ, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, నాణ్యమైన విద్య, ఉపాధివంటి రంగాల్లో వేగం పెరిగితేనే ప్రపంచ వేదికపై భారత్ సాధిస్తున్న ప్రాధాన్యం ప్రజల జీవితాల్లోకి చేరుతుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన భద్రత, వాణిజ్య ఒత్తిళ్లు వంటి పరిణామాలు విదేశాంగ విధానాన్ని నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానిస్తున్నాయి. కాబట్టి అంతర్జాతీయంగా బలమైన భారత్ అనే లక్ష్యానికి దేశీయంగా బలమైన ఆర్థిక వ్యవస్థ అవసరం. మరోవైపు మూడోసారి అధికారంలో ఉన్న నాయకత్వం దేశంలోని భిన్న ప్రాంతాలు, భాషలు, వర్గాలు, సామాజిక సమూహాలను మరింత సమర్థంగా కలుపుకుపోవాలి. జాతీయవాదం, నిర్ణయాత్మకత మోదీ రాజకీయ శైలికి ప్రధాన బలాలైనా, వైవిధ్యభరితమైన దేశంలో సమ్మిళిత పాలన కూడా అంతే అవసరం. 'బలమైన ప్రభుత్వం'తో పాటు 'అందరి ప్రభుత్వం' అనే భావన ప్రజల్లో బలపడాలి. తాజా సర్వేలో మోదీకి ఆధిక్యం కొనసాగుతున్నప్పటికీ, కొత్త రాజకీయ ముఖాలు కూడా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఇది ఇప్పటికీ స్పష్టమైన ప్రత్యామ్నాయం ఏర్పడలేదనే విషయంతో పాటు, రాజకీయ రంగం స్థిరంగా ఉండదనే వాస్తవాన్ని గుర్తుచేస్తోంది. ప్రజల ప్రాధాన్యాలు మారినప్పుడు కొత్త నాయకత్వాలకు అవకాశం ఏర్పడుతుంది. అందువల్ల ప్రస్తుత ఆధిక్యాన్ని శాశ్వత రాజకీయ హామీగా చూడకుండా, పాలనా పనితీరును మరింత మెరుగుపరిచే అవకాశంగా చూడటం బీజేపీకి అవసరం.

మోదీ, బీజేపీ ముందున్న తక్షణ పరీక్ష 2027లో జరిగే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఫలితాలు అత్యంత కీలకం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ బీజేపీ ఎదుర్కొన్న నష్టం రాష్ట్ర రాజకీయాల్లో స్థానిక అంశాల ప్రాధాన్యాన్ని స్పష్టం చేసింది. కుల సమీకరణాలు, రైతుల సమస్యలు, యువత ఉపాధి, మహిళా ఓటర్ల వైఖరి, సంక్షేమ పథకాల ప్రభావం, స్థానిక నాయకత్వంపై ప్రజల అభిప్రాయం వంటి అంశాలు అసెంబ్లీ ఎన్నికల్లో నిర్ణాయకంగా మారవచ్చు. జాతీయ స్థాయిలో మోదీకి ఉన్న ప్రజాదరణను ప్రతి రాష్ట్రంలోనూ అదే స్థాయిలో ఓట్లుగా మార్చుకోవచ్చన్న అంచనా సరైనది కాదు. రాష్ట్ర ఎన్నికలు స్థానిక సమస్యల చుట్టూనే ఎక్కువగా తిరుగుతాయి. అందుకే యూపీతో పాటు ఇతర రాష్ట్రాల ఫలితాలు 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీకి ప్రజాభిప్రాయానికి సూచికలుగా నిలవనున్నాయి. ఎన్నికల యంత్రాంగం బలంగా ఉండటం అవసరమే అయినా, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని కేవలం రాజకీయ వ్యూహాలతో అధిగమించడం సాధ్యం కాదు. దానికి పాలనా ఫలితాలే సమాధానం కావాలి. 2029లో నాలుగోసారి నాయకత్వం వహించాలంటే 2024 ఎన్నికల సందేశాన్ని లోతుగా విశ్లేషించి, మారుతున్న ఓటర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రాధాన్యాలను రూపొందించాలి. ప్రస్తుతం మోదీకి జాతీయ స్థాయిలో స్పష్టమైన ప్రత్యామ్నాయం లేకపోవడం ఆయనకు బలం. కానీ ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థుల బలహీనతపై ఆధారపడిన ఆధిక్యం కంటే, పనితీరుపై ఆధారపడిన విశ్వాసమే నిలకడైనది. అందుకే ఉద్యోగాలు, ఆదాయాలు, ధరలు, రైతులు, మధ్యతరగతి, విద్య, ఆరోగ్యం వంటి ప్రత్యక్ష ప్రజా సమస్యలపై ఫలితాలు చూపడమే రాబోయే రాజకీయ ప్రయాణానికి కీలకం. ప్రజలు ఒక నాయకుడిని ఎంతకాలం గుర్తుంచుకుంటారో నిర్ణయించేది ప్రచారంలో నిర్మించిన ప్రతిష్ఠ కాదు.. తమ జీవితాల్లో వారు అనుభవించిన పాలన. మోదీ ముందున్న అసలు పరీక్ష కూడా అదే. ప్రస్తుత ఆధిక్యాన్ని భవిష్యత్తు విజయానికి హామీగా కాకుండా, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచే అవకాశంగా మలచగలిగితేనే ఆయన నాయకత్వం తదుపరి దశలోనూ అదే స్థాయి ప్రభావాన్ని కొనసాగించగలదు. ■



ఓటమి ఒక్కోసారి బాధ కలిగించడం సహజమే. అంతకుమించి.. ఓటమిలో ఇతరులు మిమ్మల్ని సరిగా అర్థం చేసుకోకపోవడమే కొన్నిసార్లు ఎక్కువ బాధ కలిగిస్తుంది. నిజానికి -ఓటమి ఎదురైనా తట్టుకొని మళ్లీ నిలబడవచ్చు. గెలుపుకోసం మళ్లీ ఓటమినే ఆయుధంగానూ మలచుకోవచ్చు. కానీ, ఇతరుల మెప్పు కోసం ఎదురుచూస్తే.. నిరంతరం మిమ్మల్ని మీరు మార్చుకుంటూ పోతే.. అది మీ వ్యక్తిత్వాన్నే నెమ్మదిగా చంపేస్తుంది. సో, ఇతరుల కోసం కాకుండా, మీరు నిజంగా నమ్మే దాన్ని నిర్మించుకోవడంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించండి.


-మహాదేవ

## వింతల్లో వింతలు

## కొంపముంచిన పిజ్జా పిచ్చి!



పోలాండ్‌లోని షెట్జిన్‌కు చెందిన పాతికేళ్ల యువకుడు, వింత పిజ్జా ప్రాంక్‌తో ఏకంగా ఎనిమిదేళ్ల జైలుశిక్ష ఎదుర్కోబోతున్నాడు. సినిమా సీన్ తలపించేలా.. దేశవ్యాప్తంగా వందలాది అపరిచితుల చిరునామాలకు తన ప్రత్యర్థుల వ్యక్తిగత సమాచారంతో పిజ్జా ఆర్డర్లు పెట్టడం ఇతడి పని. కేవలం ఆర్డర్లే కాదు, మైనర్‌ను కిడ్నాప్ చేస్తానని, కార్యాలయాలను తగలబెడతానని, కావాలనే రోడ్డు ప్రమాదాలు సృష్టిస్తానని బెదిరించే సందేశాలూ జోడించడంతో బాధితులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒక సందర్భంలోనైతే, ఏకంగా 300 పిజ్జాలకు ఆర్డర్ పెట్టగా, దాని విలువ 37,000 జ్లోటీలు (సుమారు రూ.8.7 లక్షలు) దాటింది! పోలాండ్ సైబర్‌క్రైమ్ నిరోధక బ్యూరో అధికారులు చాకచక్యంతో అతని ఇంటిపై దాడి చేసి, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వెంటాడటం, గుర్తింపు మోసం, ఆర్థిక నష్టం కలిగించడం వంటి ఆరోపణలపై అరెస్టయిన అతని అసలు ఉద్దేశం ఏమిటో మాత్రం ఇప్పటికీ దర్యాప్తు అధికారులకు అంతుచిక్కడం లేదు.





# సేనాపతి వచ్చేస్తున్నాడు.. మళ్లీ తెరపైకి కమల్ హాసన్ ఇండియన్ 3..!

కమల్‌హాసన్ కెరీర్‌లో ల్యాండ్ మార్క్ మూవీగా నిలిచింది భారతీయుడు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కింది ఇండియన్ 2 (×అఎఖుఅ 2). శంకర్ డైరెక్షన్‌లో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన ఈ మూవీ 2024 జులై 12న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజైన ఇండియన్ 2 బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఢీలా పడిపోయింది. దీంతో ఈ ఫ్రాంచైజీలో రాబోతున్న ఇండియన్ 3పై ఇక అటకెక్కినట్టేనని వార్తలు వచ్చాయి. ఇండియన్ 2తోపాటు ఇండియన్ 3కు సంబంధించి మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తిచేసినట్టు ఇప్పటికే శంకర్ టీం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఇండియన్ 3 థియేటర్‌లో విడుదల కాదని.. ఓటీటీలో మాత్రమే రిలీజ్ అవుతుందంటూ వార్తలు కూడా వచ్చాయి. ఇంతకీ శంకర్-కమల్ హాసన్ ప్రాజెక్టు ఇక లేనట్టేనా..? అని డైలామాలో పడిపోయిన అభిమానులు, మూవీ లవర్స్ కోసం ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. కొన్ని మైనర్ ప్యాచ్ వర్క్, కంప్యూటర్ గ్రాఫిక్స్ వర్క్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్టు ఇన్‌సైడ్ టాక్. చెన్నై సర్కిల్ కథనాల ప్రకారం మేకర్స్ త్వరలోనే పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలుపెట్టనున్నారట. కమల్ హాసన్ సేనాపతిగా మరోసారి సందడి చేయనుండగా.. శంకర్ తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ కాబోతున్నాడు. ఎప్పుడు రీస్టార్ట్ అవుతుందనే దానిపై అధికారిక అప్‌డేట్ లేనప్పటికీ మేకర్స్ మాత్రం వీలైనంత త్వరలో ఇండియన్ 3ను పూర్తి చేసి విడుదల చేయాలనిప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇదే నిజమైతే శంకర్ భారతీయుడు మేనియాను మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తాడా..? అనేది చూడాలి. ఇండియన్ 2లో ఎస్‌జే సూర్య, బాబీ సింహా, సిద్దార్థ్, సముద్రఖని, లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందం, మధుబాల, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, కీలక పాత్రల్లో నటించారు. మరి ఇండియన్ 3లో మరి కొత్త యాక్టర్లెవరైనా జాయిన్ అయ్యారనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ -రెడ్ జియాంట్ మూవీస్‌పై ఉదయనిధి స్టాలిన్-సుభాస్కరన్ తెరకెక్కిస్తున్నారు.

## మంచు మనోజ్ 'వడ్డీ కాసుల వాడా'లో వెంకటేశ్వర స్వామిగా జయం రవి

ప్రముఖ తమిళ నటుడు జయం రవి (రవి మోహన్) ఒక ఆసక్తికరమైన పాత్రలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మంచు మనోజ్ హీరోగా దర్శకుడు తేజ్ ఉప్పలపాటి తెరకెక్కిస్తున్న 'వడ్డీ కాసుల వాడా' చిత్రంలో జయం రవి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి పాత్రను పోషించనున్నారు. గురువారం నాడు జయం రవి పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినీ అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ఈ సందర్భంగా ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియాలో జయం రవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పోస్ట్ చేసింది. "ప్రతి ఒక్కరి హృదయంలో కొలువైన గోవిందుడి దివ్యమైన పాత్రలో మిమ్మల్ని మా 'వడ్డీ కాసుల వాడా' చిత్రంలోకి స్వాగతించడం ఆశీర్వాదంగా భావిస్తున్నాం. ఈ ప్రత్యేక ప్రయాణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఓం నమో వెంకటేశాయ" అని పేర్కొంది. నిర్మాతల పోస్ట్‌పై జయం రవి స్పందిస్తూ, "ఇది నా పుట్టినరోజున లభించిన దైవాశీర్వాదం. సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి పాత్రను పోషించడం నా అదృష్టం. మనోజ్, అనిల్ సుంకర గారు, దర్శకుడు తేజ్ మరియు చిత్ర బృందానికి ధన్యవాదాలు. ఓం నమో నారాయణ" అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై నటుడు మంచు మనోజ్ కూడా స్పందించారు. "మా వెంకటేశ్వర స్వామిగా మీరు నటిస్తుండటం మాకు కూడా దక్కిన ఆశీర్వాదం సోదరా. మీకు జన్మదిన శుభాకాంక్షలు.







## నాగచైతన్య 'వృషకర్మ' వచ్చేస్తోంది.. భారీ అంచనాల మధ్య రిలీజ్ డేట్ ఫిక్స్!

నాగ చైతన్య హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వృషకర్మ' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మైథలాజికల్ థ్రిల్లర్‌ను 2026 డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఓ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. 'విరూపాక్ష' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తుండటం, సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంతో ఎస్‌విసిసి పతాకంపై ఈ చిత్రం నిర్మితమవుతుండటంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. పురాణ గాథల నేపథ్యంతో మిస్టరీ, థ్రిల్లర్ అంశాలను జోడించి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో నాగ చైతన్య మునుపెన్నడూ చూడని విభిన్నమైన, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఆయనకు సంబంధించిన షూటింగ్ పార్ట్ కూడా పూర్తయింది. ఇందులో చైతూ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడిగా నటిస్తుండగా, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ఆయన మేకోవర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. 'కాంతార', 'విరూపాక్ష' చిత్రాలతో సంచలనం సృష్టించిన అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, రాగుల్ డి హేరియన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనింగ్‌తో సినిమా విజువల్స్ అత్యద్భుతంగా ఉండబోతున్నాయని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్, బిహైండ్-ది-సీన్స్ వీడియోలు సినిమాలోని ప్రత్యేకమైన ప్రపంచాన్ని, విజువల్ గ్రాండియర్‌ను పరిచయం చేశాయి. తాజాగా రిలీజ్ డేట్‌ను లాక్ చేయడంతో, దేశీయంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ భారీ స్థాయిలో ప్రమోషన్లు నిర్వహించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. విభిన్నమైన కథాంశంతో, భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక బృందంతో వస్తున్న 'వృషకర్మ' నాగ చైతన్య కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.




# ఫాంటసీ హర్రర్ కామెడీగా 'నయీ నవేలి'

### ఆకట్టుకుంటున్న యామీ గౌతమ్ కొత్త సినిమా టీజర్!

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ ధర్, ఆదినాథ్ కోఠారే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'నయీ నవేలి' టీజర్ తాజాగా విడుదలైంది. హర్రర్, కామెడీ, మిస్టరీ అంశాల కలబోతగా ఫాంటసీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శక-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్, అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ బ్యానర్లపై ఈ సినిమాను నిర్మిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.కొత్త సినిమాలు చూడండి మీరట్ నేపథ్యంలో సాగే ఓ విలక్షణ కుటుంబంలోకి అడుగుపెట్టే కొత్త కోడలు పాత్రలో యామీ గౌతమ్ నటిస్తున్నారు. ఆమె రాకతో ఆ ఇంట్లో చోటుచేసుకునే వింత సంఘటనలు, కొత్త కోడలు ఒక మంత్రగత్తె అయి ఉండొచ్చనే అనుమానాలు టీజర్‌లో ఆసక్తికరంగా చూపించారు. 'తను వెడ్స్ మను రిటర్న్స్' తరహా వినోదం, 'తుంబాడ్' మిస్టరీ కలగలిపిన సరికొత్త అనుభూతిని ఈ సినిమా ఇవ్వనుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com